సాక్షి
పల్నాడు

శనివారం ‌। 21 । జూన్‌ । 2025



చౌడేశ్వరి ఆలయ వార్షికోత్సవాలు

రెంటచింతల: శ్రీ చౌడేశ్వరి అమ్మవారి ఆలయ 17వ వార్షికోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు ఓరుగంటి మారుతీ శర్మ నేతృత్వంలో పూజలు జరిగాయి.



ఆలయ నిర్మాణానికి విరాళం

నరసరావుపేట రూరల్‌: ఇస్సపాలెం మహంకాళి ఆలయ నిర్మాణానికి నరసరావుపేటకు చెందిన జాజం నాగేశ్వరరావు, మాధవి దంపతులు రూ.1,01,116 విరాళం ఇచ్చారు.



వృద్ధాశ్రమానికి విరాళం

తెనాలి అర్బన్‌: ఐతానగర్‌కు చెందిన జెట్టి రవీంద్రనాథ్‌ చౌదరి, సంధ్యారాణిలు శ్రీ మహాత్మా సేవాశాంతి ఆశ్రమానికి శుక్రవారం రూ.2.50 లక్షలు విరాళంగా ఇచ్చారు.

న్యూస్‌రీల్‌

‘యోగా డే’కు పరేడ్‌ గ్రౌండ్‌ సిద్ధం



నరసరావుపేట: కలెక్టరేట్‌ సమీపంలోని పరేడ్‌ గ్రౌండ్‌లో శనివారం ఉదయం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు శుక్రవారం సాయంత్రం నుంచి నిర్వహిస్తున్నారు. గ్రౌండ్‌ మొత్తం ఆకుపచ్చ పరదాలతో నింపేశారు. సుమారు 10 వేల మంది యోగాసనాలు సాధన చేసేలా సిద్ధం చేస్తున్నారు. వారికి అవసరమైన తాగునీరుతోపాటు వైద్య శిబిరం అందుబాటులో ఉంచుతున్నారు. కార్యక్రమంలో కలెక్టర్‌, ఎస్పీ, ఇతర జిల్లా అధికారులు పాల్గొననున్నారు.

న్యాయవాదులకు అవగాహన తరగతులు



గురజాల: జూనియర్‌ న్యాయవాదులకు శుక్రవారం చట్టాలపై అవగాహన తరగతులు నిర్వహించారు. స్థానిక కోర్టు భవనాలలో జిల్లా జడ్జి జి. ప్రియదర్శిని ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ చట్టాలపై ప్రతిఒక్కరూ లోతుగా అవగాహన కలిగి ఉండాలన్నారు. సీనియర్‌ సివిల్‌ జడ్జి వై.శ్రీనివాసరావు, జూనియర్‌ సివిల్‌ జడ్జి సత్యనారాయణ, జూనియర్‌ సివిల్‌ జడ్జి అలేఖ్య, పీపీ కందిమళ్ల సూర్యరాజు, బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు కోట శ్రీనివాసరావు, న్యాయవాదులు రామిరెడ్డి, హనుమంతరావు, వై.వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నగదు రహిత వైద్యం అందించాలి



నరసరావుపేట: డాక్టర్‌ ఎన్టీఆర్‌ వైద్యసేవలో పేషెంట్లకు బిల్లులు లేకుండా నగదు రహిత వైద్యం అందించేలా ఆసుపత్రి యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్‌ కలెక్టర్‌ సూరజ్‌ గనోరే సూచించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్‌ కార్యాలయంలో డాక్టర్‌ ఎన్టీఆర్‌ వైద్య సేవపై జిల్లా క్రమశిక్షణ కమిటీ సమావేశం జరిగింది. ఫిర్యాదుల కమిటీ సభ్యులు విచారణ చేశారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ బి.రవి, డాక్టర్‌ ఎన్‌టీఆర్‌ వైద్యసేవ జిల్లా కో ఆర్డినేటర్‌ డాక్టర్‌ జి.చంద్రశేఖర్‌, సిబ్బంది పాల్గొన్నారు.

లాసెట్‌లో సూర్యతేజకు మూడవ ర్యాంకు



నరసరావుపేట: పట్టణానికి చెందిన బత్తుల నరసింహం, సరస్వతి దంపతుల రెండో కుమారుడు సూర్యతేజ శుక్రవారం ప్రభుత్వం విడుదల చేసిన ఏపీ–లాసెట్‌ ఫలితాలలో ఓపెన్‌ కేటగిరీలో మూడో ర్యాంక్‌ సాధించారు. దివ్యాంగుడైన ఆయన పదో తరగతి, ఇంటర్‌ ప్రైవేటుగానే పూర్తి చేశారు. ఇంటర్‌లో 80 శాతం మార్కులు సాధించారు. నేషనల్‌ లా యూనివర్సిటీ నిర్వహించిన పరీక్షలకు హాజరై ఒడిశా యూనివర్సిటీలో సీటు పొందారు. 15 ఏళ్ల వయస్సులో వచ్చిన స్పాండిలైట్‌ వ్యాధితో అనారోగ్యానికి గురై ఆ తర్వాత చికిత్స చేయించుకున్నప్పటికీ అంగవైకల్యం వదలలేదు. సామాన్య కుటుంబానికి చెందిన ఆయన తండ్రి, సోదరుడు చిరు వ్యాపారం చేస్తున్నారు. జీవితంలో గొప్ప స్థాయికి ఎదగాలనే పట్టుదల, కృషితో సొంతంగా పరీక్షకు సిద్ధమై ఈ విజయం సాధించినట్లు తల్లితండ్రులు, సోదరుడు తెలిపారు. జీవితంలో ఓ గొప్ప న్యాయవాదిగా, న్యాయమూర్తిగా ఎదగాలనే ఆకాంక్షను సూర్యతేజ వ్యక్తం చేశారు.

23 నుంచి శంకర్‌ విలాస్‌ ఫ్లైఓవర్‌ పనులు

గుంటూరు వెస్ట్‌: శంకర్‌ విలాస్‌ ఫ్లైఓవర్‌ పనులు ఈ నెల 23వ తేదీ నుంచి ప్రారంభం అవుతాయని శుక్రవారం గుంటూరు జిల్లా కలెక్టర్‌ ఎస్‌.నాగలక్ష్మి తెలిపారు. తన చాంబర్‌లో నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ముందుగా ఏసీ కాలేజీ వైపు నుంచి పనులు ప్రారంభించాలని, దీనికి సంబంధించి సోమవారం నుంచి ట్రాఫిక్‌ మళ్లింపు చేపట్టాలని ఆదేశించారు. ట్రాఫిక్‌ పోలీసులు పత్రికలు, మీడియా, సోషల్‌ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేయాలని ఆమె చెప్పారు. వాహనదారులకు వీలైనంత వరకు ఇబ్బంది లేకుండా పటిష్ట ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

తాగినోళ్లకు తాగినంత..!

- సమయపాలన లేకుండా మద్యం విక్రయాలు
- ప్రైవేటు వ్యక్తులతో కూటమి ప్రభుత్వం వ్యాపారం
- అధికారుల పర్యవేక్షణ లేమితో నిర్వాహకుల ఇష్టారాజ్యం
- పాలకుల కాసుల కక్కుర్తితో రోడ్డున పడుతున్న నిరుపేదలు

కాసుల కక్కుర్తితో వేళాపాళాలేని మద్యం వ్యాపారాలకు నిరుపేద జీవితాలు రోడ్డున పడుతున్నాయి. కూటమి కాసుల కక్కుర్తితో ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి మద్యం దుకాణాలు వెళ్లాయి. పర్మిట్‌ రూములతో మూడు బాటిళ్లు.. ఆరు గ్లాసులు అన్నట్లు మద్యం విక్రయాలు సాగుతున్నాయి. ఉదయమంతా కష్టపడి పనిచేసిన నిరుపేదల సొమ్మంతా మందు చుక్కల్లో ఆవిరవుతోంది. సాయంకాలానికి ఇంటికి చేరాల్సిన కూలీ డబ్బులు మద్యం దుకాణానికే సరిపోతున్నాయి. అక్రమాలను అరికట్టాల్సిన ఎక్సైజ్‌ అధికార యంత్రాంగం కాసుల మత్తులో మునిగి తేలుతోంది.

నరసరావుపేట టౌన్‌: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మద్యం విధానాన్ని పూర్తిగా ప్రైవేటు వ్యక్తుల చేతులకు అప్పగించింది. ప్రజాప్రతినిధుల మద్దతుతో వైన్స్‌ నిర్వాహకులు మద్యం విక్రయాలను అడ్డగోలుగా సాగిస్తున్నారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటతోపాటు చిలకలూరిపేట, వినుకొండ, పిడుగురాళ్ల, మాచర్ల పట్టణాలలో అనుమతులు లేకుండానే మద్యం వ్యాపారులు పర్మిట్‌ రూములను ఏర్పాటు చేశారు. బహిరంగంగా మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. మైనర్‌ బాలురకు సైతం మద్యం విక్రయిస్తుంటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదులు వచ్చినప్పటికీ ఎక్సైజ్‌ శాఖ అధికారులు పట్టించుకోవడంతో వారిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వైఎస్సార్‌సీపీ పాలనలో మద్యం దుకాణాలను ప్రభుత్వమే నడిపేది. అది వ్యసన నియంత్రణకు దోహదపడిందని ప్రజల అభిప్రాయం. కూటమి ప్రభుత్వం మాత్రం విక్రయాలకూ టార్గెట్లు విధించింది.

ఫిర్యాదు చేసినా స్పందనేది?

మద్యం దుకాణ నిర్వాహకుల అక్రమాల వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని బార్‌ అండ్‌ రెస్టారెంట్‌ యజమానులు గతంలో ఫిర్యాదు చేశారు. తాము వ్యాపారాలు చేయలేమంటూ తాళాలు వేసి అధికారులకు తాళం చెవులు అప్పగించారు. అయినప్పటికీ ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన ఒత్తిళ్ల కారణంగా ఎక్సైజ్‌ అధికారులు చర్యలు తీసుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కాగితాల్లోనే నిబంధనలు

మద్యం దుకాణాల నిర్వహణకు ప్రభుత్వం సమయ పాలన విధించింది. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే మద్యం విక్రయాలు కొనసాగించాలి. కానీ రేయింబవళ్లు విక్రయిస్తున్నారు. రాత్రి వేళ క్వార్టర్‌కు రూ.10 అదనంగా వసూలు చేస్తున్నారు. బార్‌ అండ్‌ రెస్టారెంట్‌ల నిర్వాహకులు అర్ధరాత్రి వరకు విక్రయిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అక్రమ మద్యం వ్యాపారాన్ని ప్రోత్సహిస్తోంది. దీంతో విచ్చలవిడిగా లభ్యం అవుతున్న మద్యంతో అనేక అనర్థాలు చోటు చేసుకుంటున్నాయి. నడిరోడ్లపై మందు బాబులు మద్యం మత్తులో నిద్రిస్తూ రాకపోకలకు అంతరాయం సృష్టిస్తున్నారు. రైల్వే స్టేషన్‌, ఆర్టీసీ బస్టాండ్‌, పల్నాడు బస్టాండ్‌, కోట సెంటర్‌లలో రాత్రిళ్లు మందుబాబులు ఆయా ప్రాంతాల్లో స్వైరవిహారం చేస్తున్నారు. ప్రకాష్‌నగర్‌లో నడిరోడ్లపై తాగిన బీరు సీసాలను పడేస్తున్నారు. ఇప్పటికే అనేక గొడవలు జరిగాయి.అధికారులు మాత్రం స్పందించడం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పట్టణంలోని ఓ వైన్స్‌లో అర్ధరాత్రి వేళ కూడా మద్యం విక్రయిస్తున్న దృశ్యం

బహిరంగ మద్యపానమే..

మద్యం దుకాణాలు ఉన్న పరిసర ప్రాంతాల్లోని ఖాళీ స్థలాలను మద్యం బాబులు అడ్డాలుగా ఏర్పాటు చేసుకున్నారు. బహిరంగంగానే మద్యం తాగుతున్నారు. పట్టణ శివారు ఉన్న రియల్‌ ఎస్టేట్‌ వెంచర్‌ల వద్ద గుంపులుగా సాయంత్రం చేరి మద్యం తాగుతున్నారు. దీంతో అక్కడ నివాసం ఉండే వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.



అరండల్‌పేట రాములు వారి గుడి ఎదుట నడిరోడ్డుపై మద్యం మత్తులో నిద్రిస్తున్న దృశ్యం

యోగా దినోత్సవానికి
ఏర్పాట్లు పూర్తి

- జిల్లా వ్యాప్తంగా 5 వేల వేదికల వద్ద యోగాంధ్ర కార్యక్రమాలు
- ఏకకాలంలో పాల్గొననున్న రెండు లక్షల మంది ప్రజలు
- జిల్లా కలెక్టర్‌ అరుణ్‌ బాబు వెల్లడి



మాట్లాడుతున్న కలెక్టర్‌ అరుణ్‌బాబు

నరసరావుపేట: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లాలో వేడుకలు ఘనంగా నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్‌ పి.అరుణ్‌బాబు వెల్లడించారు. శుక్రవారం కలెక్టర్‌ కార్యాలయంలో యోగాంధ్ర, బ్లాక్‌బర్లీ పొగాకు కొనుగోలు అంశాలపై పాత్రికేయులతో ఆయన మాట్లాడారు. మొత్తం ఐదు వేల వేదికల వద్ద కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. యోగాంధ్ర యాప్‌ ద్వారా దాదాపు 10 లక్షల మంది ఔత్సాహికులు నమోదు చేసుకున్నారని, వీరిలో రెండు లక్షల మంది అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, హాస్టళ్లు, గ్రామ–వార్డు సచివాలయాల వద్ద నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారని అన్నారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్‌ పరేడ్‌ గ్రౌండ్స్‌లో కనీసం 10వేల మంది హాజరవుతారని తెలిపారు. ఆర్కియాలజికల్‌ సర్వేశాఖ ఆధ్వర్యంలో అమరావతి బౌద్ధ స్తూపం వద్ద రెండు వేల మందితో కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. పట్టణంలోని సత్తెనపల్లి బైపాస్‌ రోడ్డుకు ప్రత్యేకంగా ‘యోగా స్ట్రీట్‌’గా నామకరణం చేసి వివిధ శాఖల ఆధ్వర్యంలో రోజూ కార్యక్రమాలు నిర్వహించామన్నారు.

బ్లాక్‌ బర్లీ రైతులను ఆదుకుంటాం

బ్లాక్‌ బర్లీ పొగాకుకు గిట్టుబాటు ధర విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని, మద్దతు ధరతో యడ్లపాడు మార్క్‌ఫెడ్‌ కేంద్రంలో పంట కొనుగోలు చేస్తామని తెలిపారు. దిగుబడి పెరిగి ధర తగ్గిందన్నారు. సచివాలయ సిబ్బంది ద్వారా ఇప్పటికే 1600 మంది రైతుల రిజిస్ట్రేషన్‌ పూర్తయిందని, రైతులు పొగాకు గ్రేడింగ్‌ చేసి తీసుకురావాలని సూచించారు. ఈ ఏడాది క్రాప్‌ హాలిడే ప్రకటించాలని సూచించారు. దీంతోపాటు మిర్చి, పత్తి వంటి పంటలకు సైతం ప్రత్యామ్నాయాలు వెతకాలన్నారు. రైతుల ఆత్మహత్యలు నివారించేందుకు ప్రత్యేక కాల్‌ సెంటర్‌ ఏర్పాటును పరిశీలిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ సిబ్బందికి రెవెన్యూ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో జాయింట్‌ కలెక్టర్‌ సూరజ్‌ ధనుంజయ్‌, డీఆర్వో ఏకా మురళి, జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి పాల్గొన్నారు.

అధికారులకు దిశా నిర్దేశం

నరసరావుపేట: యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్‌ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్‌ కార్యాలయం నుంచి 21న నిర్వహించబోయే వేడుకల ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ముందస్తుగానే ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని ఆదేశించారు. తాగునీరు, స్నాక్స్‌, టాయిలెట్స్‌ తదితర కనీస సౌకర్యాలను కల్పించాలని సూచించారు. మెడికల్‌ క్యాంపులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. అన్నిస్థాయిల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. జిల్లా స్థాయిలో ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు.

పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభం

మార్క్‌ఫెడ్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు

యడ్లపాడు: పొగాకు కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్‌ పి.అరుణ్‌బాబు ప్రారంభించారు. యడ్లపాడు మండలం మైదవోలు–వంకాయలపాడు పరిధిలోని స్పైసెస్‌ పార్కు ఏపీ గిడ్డంగుల సంస్థ గోదాములో మార్క్‌ఫెడ్‌ ఆధ్వర్యంలో ఈ కేంద్రం ఏర్పాటైంది. రైతులు తెచ్చిన బేళ్ల నాణ్యతను కలెక్టర్‌ పరిశీలించారు. అనంతరం డీఏవో మురళీ అధ్యక్షత వహించిన సమావేశంలో కలెక్టర్‌ మాట్లాడారు. జిల్లాలో 99 వేల క్వింటాళ్ల దిగుబడి రాగా, కొందరు రైతులు మాత్రమే విక్రయించుకోగలిగారన్నారు. జిల్లాలో 2,505 మంది పొగాకు రైతులకు ఇప్పటి వరకు 1,600 మంది ఏపీసీఎం యాప్‌ ద్వారా రిజిస్ట్రేషన్‌ చేసుకున్నట్లు వివరించారు. నాణ్యమైన నల్లబర్లీ పొగాకుకు క్వింటాకు రూ.12 వేలు, తక్కువ నాణ్యత ఉంటే రూ.6 వేల మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి మురళి, ఆర్డీవో మధులత, మార్క్‌ఫెడ్‌ ఉమ్మడి గుంటూరు జిల్లా మేనేజర్‌ టి.నర్సింహారెడ్డి, ప్రొక్యూర్‌మెంట్‌ ఆఫీసర్‌ బి.మురళీకృష్ణ, డీసీఎంఎస్‌ (బిజినెస్‌) డి.హరగోపాల్‌, ఏపీఎస్‌డబ్ల్యూసీ మేనేజర్‌ బి.సురేష్‌, ప్రభుత్వ పొగాకు బయ్యర్‌ చెరుకూరి నాగేశ్వరరావు, ఐటీసీ జీఎస్‌–3 హెచ్‌ఆర్‌ మేనేజర్‌ కందుల బాలాజీ, ఏవో హరిప్రసాద్‌, తహసీల్దార్‌ జె.విజయశ్రీ, ఎంపీడీవో వి.హేమలతాదేవి తదితరులు పాల్గొన్నారు.



పొగాకు నాణ్యతను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్‌

సొంత మండలంలోనే బదిలీ చేయాలి



మున్సిపల్‌ కార్యాలయం ఎదుట ప్లకార్డులు ప్రదర్శిస్తున్న సచివాలయ ఉద్యోగులు

- ప్రభుత్వాన్ని కోరిన సచివాలయ ఉద్యోగులు
- జీవో నెం.5 సవరించాలని డిమాండ్‌ చేస్తూ ప్రదర్శన

నరసరావుపేట: తమను సొంత మండలంలోనే బదిలీ చేయాలని సచివాలయ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు జీవో నంబరు ఐదును సవరించాలని కోరుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల అసోసియేషన్‌ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ప్లకార్డులను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్‌ కార్యాలయంతోపాటు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం, టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్‌ చదలవాడ అరవిందబాబుకు వినతిపత్రాలు సమర్పించారు. మధ్యలో గాంధీవిగ్రహం, శివుని బొమ్మ ఐలాండ్‌, మల్లమ్మ సెంటర్లలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ప్రమోషన్‌ ఫస్ట్‌–ట్రాన్స్‌ఫర్‌ నెక్స్ట్‌, క్యాడర్‌ తక్కువ–కొరడాలు ఎక్కువ, వార్డు నుంచి ఇద్దరికే బదిలీకి అవకాశం కల్పించాలి తదితర నినాదాల ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా స్టేట్‌ మీడియా కోఆర్డినేటర్‌ షేక్‌ మహమద్‌ అలీ మాట్లాడుతూ బదిలీలకు సంబంధించిన జీవోను ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నామన్నారు. తామంతా గ్రూప్‌–4 ఉద్యోగులమని, తమకు నెలకు రూ.30 వేల జీతం మాత్రమే వస్తోందన్నారు. ఈ జీతంతో వేరే మండలాలకు పిల్లలు, వృద్ధులతో కుటుంబాలను తీసుకెళ్లి ఉద్యోగ బాధ్యతల నిర్వహణ ఆర్థికభారంతో కూడుకున్న విషయమన్నారు. తమలో 50శాతానికిపైగా మహిళలే ఉన్నారన్నారు. తామంతా ఉదయం 5 గంటల నుంచే విధి నిర్వహణలో పాల్గొంటున్నామని, సర్వేలన్నీ తామే పూర్తి చేస్తున్నామన్నారు. ఈ కేడర్‌లో ఉన్న తమను సొంత మండలాల్లో ఉద్యోగం చేయకూడదనటం చాలా దారుణమని అన్నారు. బయటి మండలాలకు వెళ్లి మహిళలు ఏవిధంగా సర్వీసు చేస్తారని ప్రశ్నించారు. ఒక వేళ తప్పనిసరిగా తమను మార్చాలని అనుకుంటే జూనియర్‌ అసిస్టెంట్‌ కేడర్‌గా తమను పెంచాలని, సాంకేతిక ఉద్యోగులకు వారికి తగ్గట్లుగా జీతాలు ఇవ్వాలని, సీనియర్‌ అసిస్టెంట్‌ కేడర్‌కు పదోన్నతులు కల్పించాలని కోరారు. ఇప్పటికే రేషనలైజేషన్‌ పేరుతో రెండు వార్డులను కలిపి బాధ్యతలు అప్పగించటంతో పనిభారంతో ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. మిగులు ఉద్యోగులను ఏం చేస్తున్నారనే దానిపై ప్రభుత్వానికి క్లారిటీ లేదని అన్నారు. జీవో నంబరు ఐదును సవరించి సొంత మండలాల్లో పనిచేసే అవకాశం కల్పించాలన్నారు. వార్డు నుంచి వార్డుకు బదిలీ చేయాలని సూచించారు. ఉద్యోగులు షేక్‌ కరిముల్లా, కె.విజయలక్ష్మి, పి.రమేష్‌, ఎం.రమేష్‌నాయక్‌, మహిమజ్యోతి, షేక్‌ మున్నా తదితరులు పాల్గొన్నారు.

కుటుంబానికి ఆరోగ్యయోగం

- 20 ఏళ్లుగా ఆస్పత్రి గడపతొక్కని యోగా గురువు
- ఎందరెందరికో ఎస్జీటీ ఉపాధ్యాయిని రాజ్యలక్ష్మి శిక్షణ
- అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం



అభ్యాసకులతో యోగా గురువు రాజ్యలక్ష్మి

నాదెండ్ల/యడ్లపాడు: నాదెండ్ల మండలం కనపర్రులోని మండల ప్రజా పరిషత్‌ పాఠశాలలో ఎస్జీటీ ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న రాజ్యలక్ష్మి యోగా సాధన ద్వారా జీవితాన్ని మలుచుకున్నారు. ఫిరంగిపురం మండలంలోని వేమవరం గ్రామానికి చెందిన రాజ్యలక్ష్మి బీకాం, బీఈడీ, అలాగే ఎంఏ యోగాతో పాటు ఇంగ్లిష్‌, తెలుగు, హిస్టరీ వంటి విభాగాల్లో కూడా ఆమెకు విద్యా ప్రమాణాలు ఉన్నాయి. ఎంఏ యోగా చదువుకున్న ఆమె యోగా ప్రక్రియను శాస్త్రీయంగా అభ్యసిస్తున్నారు. సైకి (కుండలిని) యోగ, హఠయోగ, గర్భిణుల యోగా, ఒబేసిటీ యోగా, ఒళ్లు నొప్పులకు సంబంధించిన యోగా వంటి విభాగాల్లో విశేషంగా పరిశోధన కూడా చేస్తున్నారు. ఆమె తమ పాఠశాల విద్యార్థులకు చదువుతో పాటు యోగాసనాలపై శిక్షణ కూడా ఇస్తున్నారు. పరిసర ప్రాంతాల్లోని పాఠశాలల విద్యార్థులకు యోగాలో తర్ఫీదు ఇస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

యోగా గురువుగా 18 ఏళ్లు

రాజ్యలక్ష్మి టీచర్‌గా పనిచేసిన ప్రాంతాల్లో సత్తెనపల్లి, క్రోసూరు, అచ్చంపేట నందు 2013 నుంచి యోగా గురువుగా సేవలు అందించారు. మొదటి ఐదేళ్లు పూర్తిగా ఉచిత తరగతులు నిర్వహించారు. 2016లో సత్తెనపల్లిలో నిర్వహించిన యోగ సప్తాహానికి రెండు వందల మంది హాజరై డయాబెటిస్‌ను నియంత్రించగలిగిన ప్రత్యక్ష ఫలితాలు చూశారు. కేవలం తాను పనిచేసిన స్కూల్స్‌, ఆయా గ్రామాల్లోనే కాకుండా లండన్‌, కెనడా, ఆస్ట్రేలియా, అమెరికా, పారిస్‌, జర్మనీ తదితర దేశాలకు చెందిన వారికి ఆన్‌లైన్‌ విధానంలో యోగా శిక్షణ ఇస్తున్నారు. అలాగే పోస్టల్‌ ఉద్యోగిగా రెండేళ్ల కిందట రిటైర్డ్‌ అయిన భర్త పేరారెడ్డి కూడా యోగా గురువే కావడం విశేషం. ఆయన సాయిషా యోగ శిక్షణాలయాన్ని స్థాపించి ఎందరినో యోగా ప్రక్రియ వైపు నడిపిస్తున్నారు. వీరి ఇద్దరి సంతానంలో పెద్ద కుమారుడు సాఫ్ట్‌వేర్‌ కంపెనీ ఉద్యోగులకు యోగా శిక్షణ గురువుగా వ్యవహరిస్తుండగా, చిన్న కుమారుడు కూడా యోగా సాధకుడిగా కొనసాగుతున్నారు. రాజ్యలక్ష్మి తల్లి 75 ఏళ్ల వయస్సులోనూ ఇప్పటికీ యోగాసనాలు వేయడం విశేషం. యోగాలో మంచి నైపుణ్యం కలిగిన రాజ్యలక్ష్మి కుటుంబ సభ్యులందరూ సంతోషంగా గడుపుతున్నారు.

శక్తిమంతమైన అస్త్రం



శకిమంతమైన ఆరోగ్యాన్ని అందించే యోగా శరీరానికి మాత్రమే కాకుండా మనస్సు, మనస్తత్వాలకు కూడా మార్గదర్శకం. నమ్మకం, శ్రద్ధ, ఓర్పు, మానవత్వం వంటి విలువల్ని ప్రతిరోజూ సాధన ద్వారా అలవర్చుకోవచ్చు. అందుకే యోగా చేస్తే యోగం పడుతుందని మన పెద్దలు చెబుతారు. యోగా ప్రక్రియ శరీరానికి మాత్రమే కాదు, మనస్సుకు కూడా ఓ దివ్యౌషధం. యోగా ప్రక్రియలో నియమాలు పాటిస్తేనే అది సాధ్యం. యోగాభ్యాసంలోకి వచ్చిన 20 ఏళ్లలో ఆస్పత్రి గడప తొక్కలేదు. వయస్సు, లింగ భేదం, శరీరాకృతి వంటి పరిమితులు లేకుండా ఎవరైనా యోగాసనాలు సాధన చేయవచ్చు. నిత్య సాధన ద్వారా ఫ్లెక్సిబిలిటీ పెరిగి, మానసిక నిశ్చలత, శాంతి సాధ్యమవుతాయి. అంతటి గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి భారత దేశం అందించడం మనందరికీ గర్వకారణం.

– వై. రాజ్యలక్ష్మి, యోగా గురువు

23 నుంచి గుంటూరు నగరంలో ట్రాఫిక్‌ మళ్లింపు

శంకర్‌ విలాస్‌ రైల్వే ఓవర్‌బ్రిడ్జి నిర్మాణం దృష్ట్యా మార్పులు

నగరంపాలెం: గుంటూరు నగరంలోని శంకర్‌ విలాస్‌ రైల్వే ఓవర్‌ బ్రిడ్జి నిర్మాణ దృష్ట్యా ఈనెల 23 నుంచి ట్రాఫిక్‌ మళ్లిస్తున్నట్లు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ శుక్రవారం ప్రకటనలో తెలిపారు.

- అమరావతి రోడ్డు నుంచి ఎంటీబీ సెంటర్‌ (రమేష్‌ హాస్పిటల్‌ కూడలి) వైపు వెళ్లే భారీ వాహనాలు చిల్లీస్‌ పాయింట్‌ నుంచి ఇన్నర్‌ రింగ్‌ రోడ్‌ ద్వారా ప్రయాణించాలి.
- ఎంటీబీ సెంటర్‌ (రమేష్‌ హాస్పిటల్‌ కూడలి) సెంటర్‌ నుంచి లాడ్జికూడలి వైపు వెళ్లే భారీ వాహనాలు రమేష్‌ హాస్పిటల్‌ నుంచి కంకరగుంట రైల్వే ఓవర్‌బ్రిడ్జి మార్గం మీదగా వెళ్లాలి. (పాఠశాల, కళాశాలల బస్‌లకు కూడా వర్తిస్తుంది).
- లాడ్జి సెంటర్‌ నుంచి ఎంటీబీ సెంటర్‌ వైపు కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు అరండల్‌పేట, పొట్టి శ్రీరాములు నగర్‌, డొంకరోడ్డు, మూడు వంతెనలు లేదా బ్రాడీపేట నుంచి కంకరగుంట రైల్వేఓవర్‌ బ్రిడ్జి మీదుగా వాహనదారులు ప్రయాణించవచ్చు.
- కోబాల్ట్‌పేట, కృష్ణానగర్‌, చంద్రమౌళీనగర్‌, బృందావన్‌ గార్డెన్స్‌, లక్ష్మీపురం పరిసర ప్రాంతాల నుంచి మార్కెట్‌ వైపునకు వచ్చే కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలన్నీ పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌ రోడ్‌ లేదా బ్రాడీపేట ద్వారా కంకరగుంట రైల్వేగేట్‌ అండర్‌పాస్‌ మీదగా కలెక్టర్‌ కార్యాలయం రోడ్‌, రమేష్‌ హాస్పిటల్‌ వైపుగా వెళ్లాలి.
- మూడు వంతెనలు నుంచి జీజీహెచ్‌కు వెళ్లే వారు నాజ్‌ సెంటర్‌ నుంచి పల్లవి థియేటర్‌ మార్గం మీదుగా వెళ్లాలి.
- జీజీహెచ్‌ నుంచి ఎంటీబీ సెంటర్‌కు పల్లవి థియేటర్‌, నాజ్‌ సెంటర్‌, మహిళా కళాశాల రోడ్డు మార్గాన్ని వినియోగించాలి.
- జీజీహెచ్‌ నుంచి ఆర్టీసీ బస్టాండ్‌కు పల్లవి థియేటర్‌, నాజ్‌ సెంటర్‌, భగత్‌సింగ్‌ మార్గంలో వెళ్లాలి.
- బస్టాండ్‌ నుంచి జీజీహెచ్‌కు భగత్‌సింగ్‌ విగ్రహం, నాజ్‌ సెంటర్‌, పల్లవి థియేటర్‌ మార్గం మీదుగా వెళ్లాలి.
- లాడ్జి సెంటర్‌ నుంచి ఎంటీబీ సెంటర్‌కు భారీ వాహనాలను చిల్లీస్‌, ఇన్నర్‌ రింగ్‌ రోడ్డు, ఆటోనగర్‌, బస్టాండ్‌ లేదా కంకరగుంట రైల్వే ఓవర్‌ బ్రిడ్జి మార్గాల్లో ప్రయాణించాలని అధికారులు సూచించారు.

వైఎస్సార్‌సీపీ పురపాలక అధ్యక్షుడిగా కరిముల్లా

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నరసరావుపేట నియోజకవర్గానికి చెందిన ముగ్గురికి పదవులు కేటాయిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు నరసరావుపేట పురపాలక పార్టీ అధ్యక్షుడిగా షేక్ కరిముల్లా, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా నిడమానూరి సురేంద్ర, అచ్చి శివకోటిలు నియమితులయ్యారు.

ఐటీఐ రెండో విడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

తెనాలి అర్బన్: జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలలో రెండో విడత ప్రవేశాల కోసం ప్రభుత్వం నుంచి నోటిఫికేషన్ విడుదలైనట్లు తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రావి చిన వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 15వ తేదీలోపు దరఖాస్తులను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం తెనాలి, గుంటూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో జూలై 15వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో వచ్చి వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు. జూలై 21న ఉదయం 9గంటలకు తెనాలి, గుంటూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో ఖాళీగా ఉన్న 250 సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. జిల్లాలోని పది ప్రైవేటు కళాశాలల్లో ఖాళీగా ఉన్న 1,070 సీట్లకు జూలై 23, 24,25 తేదీల్లో కౌన్సెలింగ్ జరుగుతుందని, 63045 72793, 93914 02684లో సంప్రదించాలన్నారు.

కల్తీ పాల కేసులో శిక్ష ఖరారు

నరసరావుపేటటౌన్: పాలను కల్తీ చేసినట్లు నేరం రుజువు కావడంతో నిందితుడైన పట్టణంలోని కాకతీయ నగర్‌కు చెందిన కొనిగాపోగుల చిన్న బాలకోటయ్యకు దిగువ కోర్టు విధించిన రెండు నెలల జైలు శిక్షను యథావిధిగా ఖరారు చేస్తూ స్థానిక 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్. సత్యశ్రీ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. నిందితుడు బాలకోటయ్య ఇంటి వద్ద నిర్వహించే పాల కేంద్రంలో 2015లో అప్పటి నరసరావుపేట ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తనిఖీలు నిర్వహించారు. ల్యాబ్ పరీక్షలో పాలు కల్తీ అయినట్లు నివేదిక వచ్చింది. శ్రీనివాస్ కేసు నమోదు చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో రెండు నెలలు జైలు శిక్ష విధిస్తూ 2021 మార్చి 8న నరసరావుపేట మొదటి అదనపు జూనియర్ సివిల్ కోర్టు తీర్పు వెలువరించింది. దీనిపై జిల్లా న్యాయస్థానంలో నిందితుడు అప్పీలు చేసుకున్నాడు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయస్థానం దిగువ కోర్టు తీర్పును యథాతథంగా ఖరారు చేస్తూ తీర్పు ఇచ్చింది.

పంటలకు జీవన ఎరువులు వాడండి



మాట్లాడుతున్న డీడీ శివకుమారి

పిడుగురాళ్ల: రైతులు పంటలకు రసాయన ఎరువుల వాడకం తగ్గించి జీవన ఎరువులు ఎక్కువగా వాడాలని పల్నాడు జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం డీడీ శివకుమారి తెలిపారు. మండలంలోని జూలకల్లు గ్రామంలో శుక్రవారం పత్తి పంటను ఆమె పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వేసవిలో వేసిన ముదురు పత్తి పంట ఈ ప్రాంతంలో బాగానే ఉన్నప్పటికీ పోషక విలువలు తక్కువగా ఉన్నాయని తెలిపారు. వ్యవసాయ అధికారుల సూచనలను రైతులు తప్పనిసరిగా పాటిస్తే దిగుబడి ఎక్కువగా ఉంటుందని సూచించారు. ఈ పత్తి పంటను పెట్టకు రాకుండా సరైన సమయంలో నీళ్లు పెట్టాలని, అలాగే లింగాకార బుట్టలు, సేంద్రియ ఎరువులు వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పిడుగురాళ్ల ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకానికి ఈకేవైసీ చేయించుకొని వారు వెంటనే చేయించుకోవాలని తెలిపారు. కౌలు రైతు కార్డుల కోసం అర్హులైన వారు తమ సమీపంలోని సచివాలయాల్లో సంప్రదించాలని కోరారు. పంట రుణాలు అందించేందుకు అప్పుడే అవకాశం ఉందని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలోని పత్తి పంటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు వెంటనే ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎస్ఈ డాక్టర్ పి.విజయ్ కుమార్

పిడుగురాళ్ల: వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు త్వరితగతిన అందించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ డాక్టర్ పి.విజయ్ కుమార్ సూచించారు. మాచర్ల డివిజన్ పరిధిలోని అధికారులతో కొండమోడు కార్యాలయంలో శుక్రవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తు అందించాలన్నారు. సరఫరాలో అంతరాయాలు తగ్గించాలని కోరారు. బిల్లుల వసూళ్లలో అలసత్వం వహించిన సిబ్బంది చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సూర్య ఘర్ పథకంపై వినియోగదారులకు అవగాహన కల్పించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 25వ తేదీలోపు పూర్తి చేయాలని అన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా సిబ్బంది పనితీరు మెరుగుపరుచుకోవాలని కోరారు. 50 శాతం అదనపు లోడు క్రమబద్ధీకరణ సబ్సిడీ స్కీమును వినియోగదారులు ఈ నెల 30వ తేదీ లోపు వినియోగించుకోవాలని సూచించారు. పిడుగురాళ్ల పట్టణ పరిధిలో సరఫరా సమస్యలకు 62817 02413 నంబరుకు ఫోన్ చేయాలన్నారు. ఈఈ నూతలపాటి సింగయ్య, డెప్యూటీ ఈఈ బి.నాగసురేష్ బాబు, ఏఈఈ కోట పెద్ద మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

నిత్య జీవితంలో యోగా అంతర్భాగం కావాలి



టీజేపీఎస్ కళాశాలలో యోగా సాధన చేస్తున్న విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: నిత్య జీవితంలో యోగా అంతర్భాగం కావాలని టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి పేర్కొన్నారు. పట్టాభిపురంలోని కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులతో యోగా సాధన చేయించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం మాట్లాడుతూ ప్రపంచ దేశాలకు భారతదేశం ఇచ్చిన గొప్పవరం యోగా అన్నారు. శ్వాసపై నియంత్రణ కలిగి, ప్రతి ఒక్కరు ఆరోగ్యవంతంగా జీవితాన్ని పొందగలరని తెలిపారు. కార్యక్రమంలో పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. అనితాదేవి, వైస్ ప్రిన్సిపాల్ భానుమురళి, గుంటూరు జిల్లా ఎన్ఎస్ఎస్ నోడల్ అధికారి జేవీ సుధీర్‌కుమార్, ఎన్‌సీసీ అధికారి మేజర్ పి. కుమార్ రాజా, పీడీలు ఆర్. శివాజీ, వాసుదేవరావు పాల్గొన్నారు.

- అమరావతి రోడ్డులోని శారదా స్కూల్లో విద్యార్థుల యోగా అక్షరమాల ఆకృతిలో కూర్చుని సాధన చేశారు. ఈ సందర్భంగా యోగా మాస్టారు జల్లేపల్లి వెంకటేశ్వరరావు విద్యార్థులకు యోగా ప్రాధాన్యతను తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.ఎం. దాస్, డైరెక్టర్ వి.భారతీవాణి పాల్గొన్నారు.

నడుములు విరుగుతున్నాయ్ !



అన్నదాన సత్రం పక్క రోడ్డు దుస్థితి



లక్ష్మీపురం మూడో లైను మొదట్లో భారీ గుంత

- అధ్వానంగా మారిన అన్నదాన సత్రం పక్క రోడ్డు
- రోజూ వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు
- మరమ్మతులను కూడా పట్టించుకోని నగరపాలక సంస్థ అధికారులు

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని అన్నదాన సత్రం పక్క రోడ్డు అధ్వానంగా మారింది. అమరావతి రోడ్డు మీదుగా కొరిటెపాడు సెంటర్‌కు వెళ్లేందుకు కీలకంగా ఉన్న ప్రధాన రహదారి పొడవునా గోతులు, గుంతలతో నిండి పోయింది. వాహనాల రాకపోకలకు ఏ మాత్రం అనువుగా లేదు. నిత్యం పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగస్తులతో వందలాది ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు నిత్యం ఈ రోడ్డు మీదుగా ప్రయాణం సాగిస్తాయి. నగరంలోని వివిధ ప్రాంతాల్లో రహదారులను నిర్మిస్తున్న నగరపాలకసంస్థ అధికారులు అమరావతి రోడ్డు, కొరిటెపాడును కలుపుతూ సాగుతున్న ఈ రోడ్డు నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. ఫలితంగా గుంతల్లో ప్రయాణంతో నడుములు విరుగుతున్నాయని వాహనదారులు, ప్రజలు వాపోతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి మరమ్మతులతో పాటు నూతన రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- లక్ష్మీపురం 3వ లైను రహదారిపై పడిన భారీ అగాధం ప్రమాదకరంగా మారింది. రోడ్డు ముఖ ద్వారంలో పైపులైనుకు ఏర్పడిన లీకేజీ కారణంగా దెబ్బతింది. అక్కడ భారీ గుంత ఉన్న సంగతి తెలియక వాహనదారులకు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించిన గుంతను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

నారాయణ కళాశాల దోపిడీకి అడ్డుకట్ట వేయాలి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ



కళాశాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘ నేతలు

లక్ష్మీపురం: అక్రమంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాంను వేల రూపాయలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్న కొత్తపేటలోని నారాయణ జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా గుంటూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాల వద్ద విద్యార్థి సంఘాల నేతలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాసర్‌జీ మాట్లాడుతూ కళాశాలకు గుర్తింపు కూడా లేదని ఆరోపించారు. అధిక ఫీజుల దోపిడీలకు పాల్పడుతున్నారని, తక్షణమే విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంటర్ బోర్డు పర్మిషన్ లేకుండా కళాశాల నిర్వహిస్తున్నా ఏమాత్రం పట్టించుకోవట్లేదని తెలిపారు. జిల్లా కార్యదర్శి యశ్వంత్ రఘువీర్ మాట్లాడుతూ ముందస్తు అడ్మిషన్ల పేరుతో కళాశాల యాజమాన్యాలు తల్లిదండ్రుల ఇంటికి వెళ్లి, కల్లబొల్లి మాటలు చెప్పి అడ్మిషన్లు చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. దీనిని విద్యాశాఖ అధికారులు అడ్డుకట్ట వేయాలని ఆయన కోరారు. అక్రమాలకు పాల్పడుతున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి ప్రణీత్ , ప్రత్తిపాడు నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు డేవిడ్, అమర్‌నాథ్ , నగర సహాయ కార్యదర్శి వెంకట్, నాయకులు పాల్గొన్నారు.

సమ్మెలోకి ఇంజినీరింగ్ విభాగ కార్మికులు



మేయర్‌కు నోటీసు అందజేస్తున్న యూనియన్ నాయకులు

నెహ్రూనగర్: రాష్ట్రవ్యాప్తంగా 22వ తేదీ అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి వెళుతున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజినీరింగ్ టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ గుంటూరు నగరపాలక సంస్థ కమిటీ ప్రధాన కార్యదర్శి రాయపూడి కోటి బాబు తెలియజేశారు. ఈ మేరకు శుక్రవారం నగర మేయర్ కోవెలమూడి రవీంద్రకి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా కోటి బాబు మాట్లాడుతూ నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల్లోని ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినప్పటికీ పట్టించుకోలేదని తెలిపారు. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఈ నెల 2న కార్మిక సంఘాలను చర్చలకు పిలిచి ఎటువంటి హామీ ఇవ్వలేదని, ముఖ్యమంత్రి గారితో మాట్లాడి చెప్తానని చర్చలను అర్ధంతరంగా ముగించి వెళ్లిపోయారని విమర్శించారు. ఇంతవరకు ప్రభుత్వం నుంచి పిలుపు రాకపోవడంతో ఈనెల 9న వడ్డేశ్వరంలో కమిషనర్ సంపత్ కుమార్‌ను కలిసి, 22వ తేదీ అర్ధరాత్రి నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మెలోకి వెళ్తున్నామని నోటీసు ఇచ్చినట్లు తెలిపారు.

ఏపీ బిషప్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడిగా జయప్రకాష్



జయప్రకాష్‌ను అభినందిస్తున్న విజయవాడ డెప్యూటీ కమిషనర్ కృష్ణమూర్తినాయుడు

నరసరావుపేట: ఏపీ బిషప్ కౌన్సిల్ పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ జి.జయప్రకాష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడ ఏపీ టూరిజం. పున్నమి ఘాట్లో శుక్రవారం రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజు అధ్యక్షతన ఏపీ బిషప్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జయప్రకాష్ మాట్లాడుతూ.. అనేక కార్యక్రమాలు బిషప్ కౌన్సిల్ ద్వారా నిర్వహిస్తామన్నారు. అందరికీ మేలు జరగాలని కోరుకుంటున్నట్లు తెలియజేశారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం, పల్నాడు జిల్లాలకు కూడా ఇన్‌చార్జిగా తనకు బాధ్యతలు అప్పగించారన్నారు. ముఖ్య అతిథిగా విజయవాడ డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కృష్ణమూర్తినాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా జయప్రకాష్‌ను అభినందించి సన్మానించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి బిషప్‌లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ బాపట్ల జిల్లా కన్వీనర్ వాణిశ్రీ



సీడీపీవో సుచిత్రకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

రేపల్లె: అంగన్‌వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వెంటనే వర్తింపజేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ బాపట్ల జిల్లా కన్వీనర్ సింగం వాణిశ్రీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రేపల్లె ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీడీపీవో సుచిత్రకు శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. వాణిశ్రీ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ప్రభుత్వ ఉద్యోగి అనే పదం తొలగించాలని కోరుతూ 23 తేదీ జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం ఇచ్చినా దానిలో అంగన్‌వాడీలకు ఇవ్వకుండా మోసం చేసిందని, ఎన్నికలకు ముందు అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్‌కి అన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీనిచ్చి నేడు మొండి చెయ్యి చూపిందన్నారు. గతంలో పిల్లలు చదువుకి సంబంధించిన అమ్మ ఒడి అమలైందని పేర్కొన్నారు. నేడు కూటమి ప్రభుత్వం ఆదాయ నిబంధనలు పెట్టి సంక్షేమ పథకాలను దూరంచేయటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగి అనే పదం తొలగించాలని కోరుతూ జూన్ 23న జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్ద జరిగే ధర్నాలో వర్కర్‌లు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్, ఏఐటీయూసీ నాయకులు పడమటి బిక్షాలు, షేక్ బాజీ, నాగమల్లి, జ్యోతి, హేమలత, సీహెచ్ పద్మ, పాప, విజయలక్ష్మి, వై.శారద తదితరులు పాల్గొన్నారు.

కులధ్రువీకరణ పత్రాలు లేక అవస్థలు

రాష్ట్ర బేడ బుడగ జంగం ఐక్యవేదిక జేఏసీ వ్యవస్థాపకుడు శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

లక్ష్మీపురం: రాష్ట్రంలో బేడ బుడగ జంగం కులస్తులు 20 సంవత్సరాల నుంచి కుల ధ్రువీకరణ పత్రాలు లేక అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర బేడ బుడగ జంగం ఐక్యవేదిక జేఏసీ వ్యవస్థాపకులు కడమంచి శ్రీనివాస్ తెలిపారు. గుంటూరు కొత్తపేటలోని సీపీఐ కార్యాలయం మల్లయ్య లింగం భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తక్షణమే ఎస్సీలుగా గుర్తించి కుల ధ్రువీకరణ ఇవ్వాలని ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని ఆయన కోరారు. పార్లమెంట్‌లో ఈ అంశాన్ని ప్రస్తావించి, బిల్లు పాస్ చేయించి తమకు న్యాయం చేయాలని విన్నవించారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో ఎంతటి పోరాటాలకైనా సిద్ధపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

జెడ్పీ నిధులతో చేపట్టిన పనులు వేగవంతం చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని వివిధ గ్రామాల్లో జెడ్పీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధికారులను ఆదేశించారు. జెడ్పీ కార్యాలయంలోని చైర్‌పర్సన్ చాంబర్‌లో శుక్రవారం సీఈవో వి.జ్యోతిబసు అధ్యక్షతన పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెనీ క్రిస్టినా మాట్లాడుతూ పనుల వివరాలతో నివేదికలను ప్రతినెలా మొదటి వారంలో జెడ్పీకి అందజేయాలని సూచించారు. పనుల ప్రగతిని ఎప్పటికప్పుడు గూగుల్ షీట్‌లో అప్లోడ్ చేయాలని తెలిపారు. రద్దు చేయాల్సిన పనులు, వీలుకాని వాటి వివరాలను జెడ్పీలోని ప్రణాళిక విభాగానికి తెలియపర్చాలని చెప్పారు. నిధుల వినియోగ ధ్రువపత్రాలను, పనులను పూర్తి చేసిన కాంట్రాక్టర్లు, ఏజెన్సీల బిల్లులను నిర్దేశిత ఫార్మాట్‌లో జెడ్పీకి సమర్పించాలని తెలిపారు. ఎం.బుక్, బిల్లులను భద్రంగా ఉంచాలని చెప్పారు.

జెడ్పీ కార్యాలయ పనుల పరిశీలన

జెడ్పీ పరిపాలన భవన మరమ్మతు పనులను చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా పరిశీలించారు. రూ.30 లక్షలతో చేపట్టిన కారిడార్, శ్లాబ్, టాయిలెట్ల మరమ్మతులను తనిఖీ చేశారు. పనుల్లో పూర్తి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆమె సూచించారు.

రెవెన్యూ శాఖతో ప్రజలకు నిత్యం అనుబంధం

గుంటూరు జేసీ ఎ.భార్గవ్ తేజ



కార్యక్రమంలో మాట్లాడుతున్న జేసీ

గుంటూరు వెస్ట్: పుట్టుక నుంచి మరణం వరకు ప్రజలకు రెవెన్యూ శాఖతో అనుబంధం ఉంటుందని జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ తెలిపారు. స్థానిక రెవెన్యూ కల్యాణ మండపంలో శుక్రవారం రాత్రి రెవెన్యూ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జేసీ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసే అంశంలో మరింత వేగంగా, పారదర్శకంగా రెవెన్యూ సిబ్బంది పని చేయాలని ఆయన సూచించారు. ప్రస్తుత సమాజంలో పని వేగం పెరిగిందని, దీనికి తగ్గట్లు ఉద్యోగులు ఎప్పటికప్పుడు మార్పులు చేసుకుని ముందుకు వెళ్లాలని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న కార్యక్రమంలో అందిన అర్జీలను అత్యంత వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ డే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహించడం సంతోషమని పేర్కొన్నారు. ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రోజురోజుకూ తమ బాధ్యత మరింత పెరుగుతోందని తెలిపారు. ప్రభుత్వాలు కూడా ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు.

నేడు విశాఖలో 'సిడ్స్' సదస్సు ప్రారంభం



డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి

గుంటూరు మెడికల్: క్లినికల్ ఇన్ఫెక్షియస్ డిసీజెస్ సొసైటీ (సిడ్స్) ఆంధ్ర ప్రదేశ్ చాప్టర్ సదస్సును శనివారం విశాఖపట్నంలో ప్రారంభిస్తున్నట్లు ప్రముఖ ఇన్ఫెక్షన్స్ స్పెషలిస్ట్, సిడ్స్ ప్రెసిడెంట్, గుంటూరు హెల్ప్ హాస్పిటల్ అధినేత డాక్టర్ కోనగంటి కల్యాణ చక్రవర్తి తెలిపారు. అరండల్‌పేటలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన సదస్సు వివరాలు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఫిజీషియన్లు, క్రిటికల్ కేర్ స్పెషలిస్టులు, మైక్రో బయాలజిస్టులు, పీజీ వైద్య విద్యార్థులు సదస్సుకు హాజరవుతారని పేర్కొన్నారు. విశాఖపట్నం హోటల్ గ్రీన్ పార్క్‌లో జరిగే సదస్సులో యాంటీబయోటిక్స్‌లో వచ్చిన ఆధునిక మందులు, చికిత్స పద్ధతుల గురించి వివరిస్తారన్నారు. 'రైట్ డ్రగ్ – రైట్ టైమ్– రైట్ స్టేజ్' అనే నినాదంతో సదస్సు నిర్వహిస్తున్నట్లు వివరించారు. డాక్టర్ వి.రామసుబ్రహ్మణ్యం, డాక్టర్ మోహన్ మహరాజ్, డాక్టర్ శ్రీధర్ శ్రీనివాసన్‌లు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. సీనియర్ సిడ్స్ మెంబర్ డాక్టర్ నర్రెడ్డి సునీత, డాక్టర్ గాయత్రి, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ రామసుబ్రహ్మణ్యం తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. దేశంలోనే ఇన్‌ఫెక్షన్లపై పోరాటంలో అతి పెద్ద సొసైటీగా తమ సంస్థకు గుర్తింపు వచ్చిందని చెప్పారు. సదస్సులో పలు పరిశోధన, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు డాక్టర్ కల్యాణ చక్రవర్తి వివరించారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

తాడికొండ: తుళ్లూరు మండలం వెలగపూడి సచివాలయం సమీపంలో ఈ నెల 23న నిర్వహించనున్న 'సుపరిపాలన– తొలి అడుగు' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొననున్న నేపథ్యంలో ఏర్పాట్లను శుక్రవారం కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి సంయుక్త కలెక్టర్ ఎ భార్గవ్ తేజతో కలిసి పరిశీలించారు. సభాస్థలి, బారికేడింగ్, వాహనాల పార్కింగ్, సీటింగ్ వలు ఏర్పాట్లపై అధికారులతో చర్చించి, పలు సూచనలు చేశారు. తాగునీరు అందుబాటులో ఉంచడంతో పాటు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. అధికారులంతా తమకు కేటాయించిన విధులను పాటిస్తూ సీఎం పర్యటనను విజయవంతం చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో గుంటూరు ఆర్డీవో శ్రీనివాసరావు, సీఆర్డీఏ ఈఈ శ్రీనివాసరావు, తుళ్లూరు తహసీల్దార్ సుజాత పాల్గొన్నారు.